సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ၊ 2 ၊ జూలై ၊ 2024



అసలేం జరిగింది..?

అశ్వారావుపేట ఎస్‌ఐ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 8లో



'సీతారామ' స్పీడప్

సీతారామ ప్రాజెక్ట్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే అశ్వాపురం వద్ద ట్రయల్ రన్ నిర్వహించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 26°

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

త్వరలో తాలిపేరు గేట్లు మూసివేస్తాం

● డీఈ తిరుపతి



రిజర్వాయర్‌లో చేరుతున్న బురదనీరు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను రెండు మూడు రోజుల్లో దించుతామని ప్రాజెక్టు డీఈ తిరుపతి సోమవారం తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందన్నారు. గేట్లకు సంబంధించిన రోలార్లు స్ట్రక్ అయ్యే అవకాశం లేకుండా బురదనీరంతా వెళ్లాక గేట్లను మూసివేస్తామని తెలిపారు. రెండు మూడు రోజులపాటు ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చిన వరదనీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు. గేట్లు మూశాక వారం రోజుల్లో ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు.

ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాలి

● ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గోదావరి వరద ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ముంపు గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటినుంచే అప్రమత్తంగా ఉండాలని, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వరదల సమయంలో ఉద్యోగులు ఎవరూ సెలవులు తీసుకోవద్దని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. ముంపు ప్రాంత రహదారుల్లో ప్రజలు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని, మత్స్య శాఖకు సంబంధించిన బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ , భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, ఎస్వో సురేష్‌బాబు, రాంప్రసాద్, తిరుపతి, ఉపేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెంటౌన్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం పంచాయతీకి చెందిన వజ్జా రాణి వినతిపత్రం ఇవ్వగా, విద్యుత్ శాఖ ఇంజనీర్‌కు పంపించారు. భేతాళపాడు ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తనకు కూతురుకు రామవరం నాగయ్య గడ్డ బస్తీలోని ఉన్న హాస్టల్ అడ్మిషన్ కల్పించాలని జూలూరుపాడు మండలం భేతాళపాడుకు చెందిన గుగులోతు రాంబాబు అర్జీ పెట్టుకున్నాడు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో కోల్ స్కాం!

ఇప్పటికే రక్షణ వ్యవస్థలున్నా పిడుగుపాటుతో అగ్ని ప్రమాదం!

- బొగ్గు నాణ్యత వంకతో అధికారుల చేతివాటం
- అధికంగా వినియోగమైనట్లు కాగితాల్లో లెక్కలు
- ఉన్నతాధికారులు కమీషన్లు దండుకున్నట్లు ఆరోపణలు
- ప్లాంట్ నిర్వహణ తీరుపై అనుమాన మేఘాలు



మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మణుగూరులో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ఇప్పటికే అనేక వివాదాలు చుట్టు ముట్టాయి. ప్లాంట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందనడానికి ఇటీవల పిడుగుపాటు సంఘటన ఉదాహరణగా నిలుస్తోంది. వీటికితోడు నిర్వహణలో చేతివాటం కారణంగా ప్లాంట్ మరింత నష్టాల్లోకి వెళ్లినట్టుగా తాజాగా ఆరోపణలు వస్తున్నాయి.

బొగ్గు సరఫరా

మణుగూరు నుంచి బీటీపీఎస్‌కు నిత్యం 14 నుంచి 15 వేల టన్నుల బొగ్గు సరఫరా అవుతోంది. ఇలా సరఫరా అయ్యే బొగ్గు లారీల్లో ర్యాండమ్‌గా ఎనిమిది లారీల నుంచి శాంపిల్స్ తీసుకుంటారు. వీటి గ్రేడ్‌లను బీటీపీఎస్, సింగరేణి సంస్థలు సంయుక్తంగా నిర్ధారిస్తాయి. నాణ్యత విషయంలో ఇరు వర్గాల మధ్య ఏకాభిప్రాయం రాకపోతే థర్డ్ పార్టీ ద్వారా మరోసారి పరీక్ష నిర్వహించి బొగ్గు గ్రేడ్, నాణ్యతలను నిర్ణయిస్తారు. ప్రతి రోజూ ఈ రకమైన పరీక్షలు జరుగుతాయి. వాటికి సంబంధించిన రిపోర్టులు మరుసటి రోజు వెల్లడవుతాయి. అంతేకాకుండా సరఫరా చేసిన బొగ్గును మండించినప్పుడు పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) పర్సంటేజీని నిత్యం చెక్ చేస్తారు. ఇందులో పీసీఎఫ్ 85 శాతం కంటే తక్కువ వస్తే బొగ్గు నాణ్యతపై బీటీపీఎస్ అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది.

గ్రేడింగ్‌లో సంక్లిష్టత

మణుగూరు ఏరియా నుంచి రోజూ సగటున 35 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో మేలురకానికి చెందిన జీ–5, జీ–6 రకం బొగ్గు సగటున ఐదారు వందల టన్నులు మించదు. కానీ తక్కువ ఉష్ణశక్తిని విడుదల చేసే జీ – 17, జీ – 19 రకం బొగ్గులకు నాణ్యమైన జీ –5, జీ–6 రకం బొగ్గును కలపడం ద్వారా సగటున జీ–13 బొగ్గుగా పేర్కొంటూ బీటీపీఎస్‌కు సింగరేణి సరఫరా చేస్తోంది. ప్లాంట్‌కు రోజూ సగటున 14 వేల టన్నుల బొగ్గు అవసరం పడుతుంది. అయితే బొగ్గు ఉత్పత్తి, గ్రేడ్లుగా విభజించడంలో క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందుల కారణంగా ప్రతీరోజు జీ–13 బొగ్గునే సరఫరా చేయడం సాధ్యపడదు. దీంతో కొంతమేరకు నాణ్యత తక్కువగా ఉండే గ్రేడ్ బొగ్గు సరఫరా అవుతుంది. ఈ మేరకు ప్లాంటులో అధికంగా బొగ్గు వినియోగం జరుగుతుంది.

గోదావరిలో ముంచేశారు?

లెక్కల్లో అధికంగా చూపించిన బొగ్గులో సింహభాగాన్ని 2022 జూలై, ఆ తర్వాత వచ్చిన గోదావరికి వచ్చిన వరదల్లో మునిగిపోయినట్టుగా కట్టుకథ అల్లినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. ప్రతీ వానాకాలంలో కోల్‌యార్డులో ఉండే బొగ్గు తడిసిపోవడం, ఎండా కాలంలో వేడి కారణంగా కాలిపోవడం వల్ల నష్టాలు వస్తున్నాయంటూ మరో స్టోరీని కూడా నడిపించినట్టు తెలుస్తోంది.

విచారణ చేపట్టాలి

అధికారుల చేతివాటం కారణంగా రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల కంటే భద్రాద్రి ప్లాంట్‌లో యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి అధికంగా ఖర్చు అవుతోంది. ఆ మేరకు ప్రజలపై భారం పడుతోంది. ఇప్పటికే భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీతో విచారణ జరిపిస్తోంది. అన్ని రకాల రక్షణ వ్యవస్థలు ఉన్నా ప్లాంటుపై పిడుగుపడటం, స్విచ్‌యార్డులో ట్రాన్స్‌ఫార్మర్లు తగలబడిన తీరు ప్లాంటు నిర్వహణలో లోపాలను ఎత్తి చూపుతోంది. ఈ నేపథ్యంలో బొగ్గు సరఫరా పేరుతో జరుగుతున్న దోపిడీపై కూడా దృష్టి పెట్టాలనే డిమాండ్ వస్తోంది.

చేతివాటం

ఇటీవల తెలంగాణ జెన్‌కో అందించిన వివరాల ప్రకారం బీటీపీఎస్‌లో నిర్దేశిత లక్ష్యం కంటే ఏకంగా 4.16 లక్షల టన్నుల బొగ్గును అధికంగా వినియోగించినట్టు వెల్లడైంది. అసాధారణ స్థాయిలో బొగ్గు వినియోగం పెరగడం వెనుక కొందరు బీటీపీఎస్ ఉన్నతాధికారుల స్వార్థ ప్రయోజనాలు దాగున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. బొగ్గు సరఫరాలో ఉండే లొసుగులను ఆధారంగా చేసుకుని కాగితాలపైనే ఎక్కువ బొగ్గును చూపిస్తూ ఆ మేరకు బిల్లులపై కమీషన్లు రాబట్టారనే గుసగుసలు ప్లాంట్ లోపల వినిపిస్తున్నాయి.

రూ. 450 కోట్లతో ఓఆర్ఆర్

- ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు
- ఇతర అభివృద్ధి పనులకు మరో 72.86 కోట్లు..
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణానికి రూ.450 కోట్లు మంజూరయ్యాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.128.48 కోట్లు, విద్యానగర్ కాలనీలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 4.కోట్ల నిధులతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర మంత్రులతో శంకుస్థాపన చేసుకున్న అనతి కాలంలోనే ప్రభుత్వం మళ్లీ నిధులు మంజూరు చేసిందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇతర అభివృద్ధి పనులకు మరో రూ. 72.86 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. 930పీ, 30వ నంబర్ జాతీయ రహదారులను కలుపుతూ అనిశెట్టిపల్లి, పాల్వంచ, సర్వారం, రామవరం, జగన్నాథపురం గ్రామాల మీదుగా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు 25 కిలోమీటర్ల ఔటర్ రింగు రోడ్డు రహదారి నిర్మాణానికి రూ. 450 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ రహదారి నిర్మాణంతో జంట పట్టణాలకు ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరనుందన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి 2.64 కోట్లు, విజయవాడ- జగదల్‌పూర్ (30వ నంబర్) జాతీయ రహదారిలో కిన్నెరసాని నదిపై వంతెన నిర్మాణానికి రూ.20.22 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులు పూర్తయితే కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు నగరాలకు దీటుగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ నాయకులు ఆళ్లమురళి, కొండా వెంకన్న, టీడీపీ జిల్లా నాయకులు నల్లమల వేణు, శరత్, సీపీఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ రావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, భుక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నూనావత్ గోవిందు, యూసఫ్, నేరెళ్ల రమేష్ పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష

తుక్కు తరలింపులో అవినీతిపై ఆరా..



కేటీపీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్

పాల్వంచ: కేటీపీఎస్ ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్) కూల్చివేత పనుల్లో అనేక లోపాలు ఉన్నాయని, పారదర్శకత లోపించిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాత ప్లాంట్‌లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. సీఈ పి.వెంకటేశ్వరరావు లీవ్‌లో ఉండటంతో ఇన్‌చార్జి సీఈ జి.శ్రీనివాసరావు, 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు, ఎస్ఈ కిరణ్‌కుమార్ తదితర అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుమానాలు నివృత్తి చేసేవరకు తుక్కు తరలింపును నిలిపివేయాలని చెప్పినా, పనులు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కలెక్టర్ వెళ్లిన తర్వాత పాత తేదీతోనే కూలింగ్ టవర్‌కు అనుమతులు తీసుకున్నట్లు తనకు సమాచారం ఉందని, టెండర్ ప్రక్రియలోనే తక్కువ కోట్ చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఫర్నిచర్ ఎక్కడికి పంపించారని, కొత్త స్పేర్ పార్ట్స్‌ను సైతం పాత వాటి కింద లెక్కగట్టి అమ్మారనే ఆరోపణలు ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఇక్కడి అధికారులతీరు పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎస్ఈ యుగపతి, డీఈలు రామకృష్ణ, మంగీలాల్, సీపీఐ నాయకులు సాబీర్‌పాషా, విశ్వనాథం పాల్గొన్నారు.

ఓఎస్డీగా పరితోష్ పంకజ్

భద్రాచలం ఏఎస్పీగా అంకిత్‌కుమార్ సంక్వార్



అంకిత్‌కుమార్ సంక్వార్



పరితోష్ పంకజ్

కొత్తగూడెంటౌన్/భద్రాచలంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం డీజీపీ కార్యాలయం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పరితోష్ పంకజ్‌ను కొత్తగూడెం ఓఎస్డీగా నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఓఎస్డీ టీ.సాయిమనోహర్‌కు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. పరితోష్ స్థానంలో భద్రాచలం నూతన ఏఎస్పీగా అంకిత్‌కుమార్ సంక్వార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంకిత్‌కుమార్ సంక్వార్ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ జిల్లా మలాసా మండలం నిగోహి గ్రామవాసి. ఈ ఏడాది మార్చిలో వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అనంతరం జనగామ ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించాక బదిలీల్లో భాగంగా భద్రాచలం ఏఎస్పీగా వచ్చారు. కాగా గతేడాది జనవరి 30వ తేదీ నుంచి భద్రాచలం ఏఎస్పీగా పనిచేసిన పరితోష్ పంకజ్‌కు గోదావరి వరదలు, ముఖ్యమంత్రి పర్యటన, గంజాయి రవాణా విషయంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారనే పేరువచ్చింది.

1,085 మంది ఉపాధ్యాయుల బదిలీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 1,085 మంది ఎస్‌జీటీలను బదిలీ చేస్తూ డీఈఓ వెంకటేశ్వరాచారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పలువురు బదిలీ స్థానాలకు వెళ్లి విధుల్లో చేరారు. 80 మంది భాషా పండితుల, పీఈటీలకు సంబంధించి బదిలీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. మళ్లీ షెడ్యూల్ విడుదల అయితే, ఆ ప్రకారం మిగిలిపోయిన పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేస్తామని డీఈఓ తెలిపారు.

ఇల్లెందులో తొలి కేసు నమోదు

కొత్త చట్టం ప్రకారం నమోదు చేసినట్లు వెల్లడించిన పోలీసులు

ఇల్లెందు: కొత్త చట్టం ప్రకారం సోమవారం ఇల్లెందులో తొలి కేసు నమోదైంది. దేశవ్యాప్తంగా మూడు కొత్త చట్టాలు అమల్లోకి రాగా, జిల్లాలో తొలి కేసు ఇదే. ఎస్ఐ సందీప్‌కుమార్ కథనం ప్రకారం.. ఆర్మీలో పనిచేస్తున్న ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన వేప తిరుమల బాబు రెండు నెలల సెలవుపై ఇంటికి వచ్చాడు. సోమవారం బైక్‌పై స్నేహితుడు లింగరాజుతో కలిసి ముకుందాపురం వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లెందు–మహబూబాబాద్ రోడ్డులో బైక్‌ను మహబూబాబాద్ వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తిరుమలబాబు, లింగరాజు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తిరుమలబాబు తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు మహబూబాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ చిన్నాపై భారతీయ న్యాయ సంహిత చట్టంలోని 120(ఏ) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

నిర్వహణ లోపంతోనే..?

- బీటీపీఎస్‌లో పిడుగుపాటుతో నష్టం జరిగినట్లు ఆరోపణలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులు



బీటీపీఎస్‌లో జీటీ-1 వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

మణుగూరు టౌన్: నిర్వహణ లోపం వల్లే బీటీపీఎస్‌లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్లాంట్ చుట్టూ పిడుగులు పడకుండా (ఎల్‌ఏ) లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేస్తారు. జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్–1 వద్ద ఎల్‌ఏ పనిచేయకపోవడం వల్లే పిడుగు పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎల్‌ఏ చివర భాగంలో భూమికి అనుసంధానించి ఇచ్చే ఎర్త్ సరిగా లేకపోవడం వల్ల ఇలా జరిగి ఉండచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు జీటీ–1పై పిడుగు పడ్డట్లు అక్కడ ఉంచిన ఎల్‌ఏలో రికార్డయిందని అధికారులు చెబుతున్నారు. ప్లాంట్ ఏర్పాటు నుంచి నేటి వరకు ఎల్‌ఏ నిర్వహణపై దృష్టి సారించలేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఎల్‌ఏల జీవిత కాలం ఐదేళ్లు మాత్రమేనని అధికారులు ధ్రువీకరిస్తున్నారు. కానీ బీటీపీఎస్‌లో యూనిట్–1 సింక్రనైజేషన్ 2019 సెప్టెంబర్ మాసంలో పూర్తికాగా, ఇంకా ఐదేళ్లు పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో నాణ్యతా లోపం వల్లే ఎల్‌ఏ పనిచేయలేదా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. జీటీ–1పై ఇప్పటికే పదిసార్లు పిడుగుపడ్డట్టు ఎల్‌ఏలో రికార్డయిందని, అయినా ప్రమాదం జరగలేదని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. జీటీ–1కు సమీపంలో చిమ్నీలు, కూలింగ్ టవర్లు 275 మీటర్ల ఎత్తులో ఉండగా, వాటితోపాటు స్విచ్‌యార్డుపై లైట్నింగ్ అరెస్టర్లు ఉన్నాయి. అక్కడ కూడా ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. జీటీ–1 వద్ద అధిక తీవ్రత కలిగిన పిడుగుపాటు ప్రభావం వల్లే ఇలా జరిగి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. భోపాల్ నుంచి వచ్చిన బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులు శశికాంత్ రెడ్డి తదితరులు సోమవారం ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించినట్లు తెలిసింది. మంగళవారం నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. బీటీపీఎస్‌లోనే ఉన్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య బీహెచ్‌ఈఎల్ డిజైనింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రమాదానికి సంబంధించి సమగ్ర లోతుగా పరిశీలించాలని కోరినట్లు సమాచారం. కాగా పిడుగుపాటుకు గురై దగ్ధమైన జీటీ–1ను పూర్తిగా మార్చాలని బీహెచ్‌ఈఎల్ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి : ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనొక ప్రకటన చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులను గుర్తించాలని తెలిపారు. ఇందుకోసం ఐదు బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బాలబాలికలను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాల కార్మికుల సమాచారం తెలిస్తే 100కు లేదా 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- ఇంటర్వ్యూలకు 2,450 మంది హాజరు
- 1,563 మంది ఉద్యోగాలకు ఎంపిక
- జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు



కొత్తగూడెం క్లబ్‌లో జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా శిశు సంక్షేమశాఖ, ఉపాధి కల్పన అధికారిణి వేల్పుల విజేత, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 2,450 మందికి పైగా నిరుద్యోగులు మేళాకు తరలివచ్చారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర విద్యార్హతలు కలిగినవారు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. నిరుద్యోగులు కొందరు క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి వివరాలు నమోదు చేసుకోగా, మరికొందరు కంపెనీల ప్రతినిధుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మొత్తం 60 కంపెనీల్లో 1,531 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కె. సంజీవరావు తెలిపారు. వీరిలో 928 మందికి అక్కడే నియామక పత్రాలు అందజేశారు. మరో 603 మందికి త్వరలోనే నియామక పత్రాలు ఇస్తామని ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు.

నా తొలి జీతం అమ్మకు ఇచ్చా : కలెక్టర్ జితేష్

నా తొలి జీతం ఇచ్చి అమ్మకళ్లలో ఆనందం చూశానని, మీరు కూడా మీ మొదటి జీతం మీ అమ్మ నాన్నలకు ఇవ్వండని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఉద్యోగం చిన్నదా, పెద్దదా అని సందేహించకుండా ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యం పెంచుకుంటే వేతనాలు పెరుగుతాయన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. ఇంకా జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి కె.సంజీవరావు, జిల్లా సంక్షేమ శాఖ, ఉపాధికల్పన శాఖ అధికారి వేల్పుల విజేత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, లక్ష్మణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేసుకునేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న యువతి



ఉద్యోగానికి ఎంపికైన యువకుడికి నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్, ఉపాధి కల్పనాధికారి విజేత తదితరులు

ఉద్యోగానికి ఎంపికయ్యాను

కొత్తగూడెంలో జాబ్ మేళాకు రావడం ఆనందంగా ఉంది. డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలకు హాజరు కాగా హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. కాల్ లెటర్ త్వరలో పంపిస్తామని చెప్పారు. ఆనందంగా ఉంది.

– వి.ఇందుప్రియ, పాల్వంచ

మాకు కూడా మంచి వేదిక

మేము ఓలా, జొమాటో మాదిరిగా సేవలను అందిస్తున్నాం. మా సంస్థలో పని చేసేందుకు ఉత్సాహం ఉన్న యువత కోసం జాబ్‌మేళాల్లో ఇంటర్వ్యూలు చేశాం. ఇక్కడ ఏర్పాట్లు భాగున్నాయి. మేళా నిరుద్యోగులతో పాటు మాకు కూడా మంచి వేదికగా మారింది.

–జి.జీవన్ రైడాన్ సంస్థ ప్రతినిధి, కొత్తగూడెం

ఉద్యోగులను ఎంపిక చేసుకునే అవకాశం

మా సంస్థకు కావాల్సిన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు మెగా జాబ్‌మేళాకు వచ్చాం. మాతో పాటు నిరుద్యోగులకు ఈ వేదిక చాలా ఉపయోగకరంగా మారింది. ఉత్సాహంగా ఉన్న యువతను ఎంపిక చేశాం.

–శ్రీను దగ్గుబాటి, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి

క్లుప్తంగా

వైద్యుల సేవలు వెలకట్టలేనివి..



విక్టర్ వందనంను సత్కరిస్తున్న సుజాత

సింగరేణి(కొత్తగూడెం): వైద్యుల సేవలు వెలకట్టలేనివని సింగరేణి ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ సుజాత అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎంఓ మాట్లాడారు. అనంతరం డాక్టర్లు ప్రతిజ్ఞ చేశారు. సీఎంఓను సత్కరించారు. కార్యక్రమంలో విక్టర్ వందనం, టి.రవీంద్ర, మాలతి, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరుగురు జూనియర్ కార్యదర్శులకు పదోన్నతి



నియామకపత్రం అందుకుంటున్న రవి

పాల్వంచరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. మండలంలోని తోగ్గూడెం, యానంబైల్, సూరారం, కేశవాపురం, పాండురంగాపురంతండా, పాయకారియానంబైల్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రవి, దేవ్‌సింగ్, మంగమ్మ, కృష్ణవేణి, కాళీ, మధుకు కార్యదర్శులుగా పదోన్నతి లభించిందని ఎంపీఓ నారాయణ తెలిపారు. సోమవారం వారు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయ్‌భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సాగు భూముల సర్వే

కల్లూరురూరల్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన సాగు భూముల సర్వే సోమవారంతో ముసిగింది. గత ఏడాదితో పాటు ఈ ఏడాది ఎంపిక చేసిన సర్వే నంబర్లలో ఏఏ పంటలు సాగు చేశారు? ఒక వేళ పంట సాగు చేయక ఖాళీ బీడుగా ఉంచితే కారణాలేంటి? అనే విషయాలపై వ్యవసాయ శాఖ ఏఈఓలు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. మండలంలోని కొర్లగూడెం క్లస్టర్‌కు 400 సర్వే నంబర్లు, ముచ్చవరం క్లస్టర్‌కు 400 సర్వే నంబర్లు, బత్తుపల్లి క్లస్టర్‌కు 78 సర్వే నంబర్లు, కల్లూరు క్లస్టర్‌కు 53 సర్వే నంబర్లు, తాళ్లూరు వెంకటాపురం, చిన్నకోరుకొండి క్లస్టర్లకు 127 సర్వే నంబర్లు కేటాయించారు. కల్లూరు మండలంలో మొత్తం 1,058 సర్వే నంబర్లలో సర్వేను కల్లూరు ఏఓ ఎం.రూప పర్యవేక్షణలో నిర్వహించారు. వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వ్యవసాయ శాఖకు పంపించారు.

రేపు కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్: పాల్వంచలో ఈ నెల 3న జిల్లా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8,10,12 వయసులోపు బాలబాలికలకు 50 మీ, 100 మీ, 300 మీ, 400 మీ, 600 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ అంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ చూపినవారిని హైదరాబాద్‌లోని గోపిచంద్ అకాడమీలో జరిగే రాష్ట్ర కిడ్స్ చాంపియన్‌షిప్‌నకు పంపుతామని, వివరాలకు కోచ్ పి.నాగేందర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు తెలుగు వెలుగు జ్ఞాన బుద్ధ పూర్ణిమ జాతీయ అవార్డు లభించింది. ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా వెంకటేశ్వరరావుకు అవార్డు అందజేశారు. సోమవారం అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు.

దివాలా పిటిషన్ దాఖలు

ఖమ్మంలీగల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గంట గోవర్ధన్ మొత్తం 18 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ రూ.52,48,000కు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. దివాలాదారుడు శ్రీదుర్గ వీల్‌కేర్ పేరుతో చక్రాలు, కారుకు సంబంధించిన డెకార్స్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో పెట్టుబడి కోసం బంధువులు, స్నేహితుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్నాడు. నష్టం రావడంతో రుణ దాతల నుంచి ఒత్తిడి అధికమైంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో మొత్తం 18 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ న్యాయవాది భూక్య రమేశ్ ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

‘సీతారామ’ స్పీడప్



తిప్పారెడ్డిగూడెం సమీపంలో సాగుతున్న సీతారామ కాల్వ పనులు

- ప్రాజెక్టు ప్యాకేజీల పనుల జాప్యంతో ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ
- డోర్నకల్ వద్ద మున్నేరు నీటిని సీతారామకు కలిపేందుకు అధికారుల ప్రతిపాదన
- త్వరగా నీరందించాలని మంత్రి పొంగులేటి ఆదేశం



దమ్మాయిగూడెం వద్ద సొరంగమార్గం పనులకు ఉపయోగిస్తున్న డంపర్లు

తిరుమలాపాలెం: జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే అశ్వాపురం నుంచి ఏన్కూరు వరకు ఎత్తిపోతల ద్వారా ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. అయితే సీతారామ నీటిని పాలేరు జలాశయంలోకి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన కాల్వల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏన్కూరు నుంచి పాలేరు లింక్ కెనాల్ వరకు 75.5 కిలో మీటర్ల మేర కాల్వల నిర్మాణానికి సుమారు రూ.1800 కోట్లు కేటాయించగా పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. 13వ ప్యాకేజీ ద్వారా 0–10.5 కిలోమీటర్లు, 14వ ప్యాకేజీలో 10.5 నుంచి 39.5 కిలోమీటర్లు, 15వ ప్యాకేజీలో 39.5 నుంచి 62.7 కిలో మీటర్లు, 16వ ప్యాకేజీ ద్వారా 62.7 నుంచి 75.5 కిలోమీటర్ల కాల్వల నిర్మాణాలు చేపట్టి పాలేరు చెరువులోకి నీరు విడుదల చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాగా 13వ ప్యాకేజీ పనులు చేపట్టే ప్రాంతంలో అటవీ భూమి ఉండడంతో అనుమతుల్లో జాప్యంనెలకొనగా, 14వ ప్యాకేజీలో 2 శాతం మాత్రమే పనులు జరిగాయి. దీంతో గోదావరి జలాలు పాలేరుకు వచ్చే కల నెరవేరని పరిస్థితి నెలకొంది. 15వ ప్యాకేజీ పనులు 70 శాతం పూర్తి కాగా 16వ ప్యాకేజీలో 30 శాతం పనులు చేపట్టడంతో పాటు సొరంగ మార్గం పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. సీతారామ కాల్వలు మున్నేరు, ఆకేరు నదుల మీదుగా వస్తుండడంతో ఇరిగేషన్ అధికారుల దృష్టి ఈ నదులపై పడింది. నదులకు వస్తున్న వరదను సీతారామ కాల్వలకు అనుసంధానం చేస్తే పాలేరుకు నీరందించవచ్చనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. డోర్నకల్ సమీపంలోని మున్నేరు వద్ద సీతారామ కాల్వలకు అనుసంధానం చేస్తే 4,500 క్యూసెక్కుల నీటిని పాలేరు రిజర్వాయర్‌కు తీసుకరావచ్చని ఇరిగేషన్ అధికారులు మంత్రికి వివరించారని సమాచారం. కాగా 16వ ప్యాకేజీలో 8 కిలోమీటర్లు సొరంగ మార్గం ఉండడం, తవ్వకాల్లో రాతిశిలలు వస్తుండడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు దమ్మాయిగూడెం, బీరోలు ప్రాంతాల్లో మూడు పాయింట్ల ద్వారా 420 మీటర్ల సొరంగ మార్గం పూర్తిచేయగా, కూసుమంచి మండలం పోచారం వద్ద మరో పాయింట్ ఏర్పాటు చేసి ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తి కావాలంటే సుమారు 18 నెలలు పడుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సాధ్యమైనంత త్వరగా పాలేరుకు సాగునీరు తీసుకొచ్చేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు.

> **పాలేరులోకి వరద నీరు కలిపేలా..**
>
> సీతారామ ప్రాజెక్టు ద్వారా పాలేరు రిజర్వాయర్‌లోకి నీరు అందించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గోదావరి జలాలు ఆలస్యం కానుండడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. డోర్నకల్ సమీపంలోని మున్నేరు వద్ద సీతారామ కాల్వతో అనుసంధానం చేసి వరద నీటిని పాలేరులో కలిపే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.
>
> – బాణాల రమేశ్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ

అసలేం జరిగింది..?

- ఎస్‌ఐ ఆత్మహత్యాయత్నానికి వెనుక కారణాలు ఏంటి?
- సీఐ, మరో నలుగురు సిబ్బందిపై ఆరోపణలు?
- రెండు వర్గాలుగా మారి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు



యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ వివాదానికి కేంద్రబిందువైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ ఆదివారం ఉదయం నుంచి రాత్రి 11.30 గంటల వరకు అదృశ్యం కావడం కలకలం సృష్టించింది. ఆ తర్వాత పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో తీవ్ర చర్చనీయంశంగా మారింది. పోలీస్ స్టేషన్‌లో ఓ ఉన్నతస్థాయి ఉద్యోగి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడే స్థాయిలో ఏం జరిగింది? అసలు దీనికి కారణాలు ఏమిటి? ఉన్నతాధికారుల మౌనం దేనికనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వేధింపులు, ఫిర్యాదులే కారణమా?

పార్లమెంట్ ఎన్నికల బదిలీల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన మణుగూరు పోలీస్ స్టేషన్ నుంచి అశ్వారావుపేటకు ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ఎస్‌ఐ అదృశ్యం, ఆత్మహత్యాయత్నానికి తోటి సిబ్బంది వేధింపులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులే కారణమని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌ఐ.. తన సన్నిహితులతో వాపోయినట్లు విశ్వసనీయ సమాచారం. కొద్దిరోజులుగా పోలీస్‌స్టేషన్‌లో పని చేసే నలుగురు సిబ్బందికి ఎస్‌ఐకి మధ్య విభేదాలు చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు రాగా, ఇదే అదునుగా సదరు సిబ్బంది కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఓ ఏఎస్‌ఐ తనను తీవ్రంగా దూషించాడని ఎస్పీకి నేరుగా చెప్పడంతో.. ఉన్నతాధికారులు ఎస్‌ఐని సున్నితంగా మందలించినట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు సిబ్బంది కలిసి ఒక వర్గంగా మారి తనపై ఫిర్యాదులు చేస్తున్నారని పాల్వంచ డీఎస్పీకి చెప్పగా.. ఆయన ఎస్‌ఐపైనే ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ఒక వర్గంగా మారి ఎస్‌ఐకి సహకరించడం లేదని, ఏదైనా ఆదేశాలిచ్చినా నిర్లక్ష్యం చేస్తున్నారని, స్థానిక సీఐ ఐదు నెలల వ్యవధిలో నాలుగు మెమోలు ఇచ్చారనే ప్రచారం కుడా సాగుతోంది. దీంతోనే ఎస్‌ఐ శ్రీనివాస్ తీవ్ర మనోవేదనకు గురై, పురుగులమందు తాగాడని మరో వర్గం సిబ్బంది చెబుతున్నారు.

> **పరిస్థితి విషమంగానే..**
>
> పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎస్‌ఐ శ్రీనివాస్‌ను ఆదివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించి యశోద ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం ఉదయం అపస్మారకస్థితి నుంచి బయటకు రాగా, కొద్ది సేపు కుటుంబీకులు, బంధువులతో మాట్లాడినట్లు తెలిసింది. కాగా, ప్రమాదకరమైన గడ్డి మందు కావడంతో మందు ప్రభావం లివర్, కిడ్నీలపై పడిందని, కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ అందిస్తున్నట్లు సమాచారం. మరి కొన్ని గంటలు గడిస్తే కానీ భరోసా చెప్పలేమని వైద్యులు అంటున్నట్లు తెలిసింది. కాగా, ఎస్‌ఐ శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బంధువులు, కుటుంబీకులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

కలెక్టర్ గౌతమ్ దంపతులకు సన్మానం



కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా సుమారు మూడేళ్ల విధులు నిర్వర్తించి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లిన కలెక్టర్ వీపీ గౌతమ్ దంపతులకు సోమ వారం రాత్రి నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సన్మానం చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. సీపీ సునీల్‌దత్, ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్‌రెడ్డి, వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల, ఆర్‌సీఓ ప్రత్యూష తదితరులు మాట్లాడారు. కలెక్టర్‌గా గౌతమ్ వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి అందించిన తీరును వివరించారు. తొలుత కలెక్టర్ దంపతులకు పూజారులు వేదమంత్రోచ్ఛణతో స్వాగతం పలకగా.. అధికారులు, ఉద్యోగులు కలెక్టర్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వినోద్, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు

ఖమ్మంవైద్యవిభాగం: గతంలో జిల్లాలో వ్యాధులు ప్రబలిన గ్రామాల ఆధారంగా ఈ ఏడాది పగడ్బందీగా ప్రణాళిక తయారు చేసుకొని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం ఆశా ఫెసిలిటేటర్స్, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి సమావేశాలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకునే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జ్వరాల సర్వే చేసి జిల్లా ఎపిడమిక్ కంట్రోల్ టీంకు ముందుగానే సమాచారం అందించి తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం పాటిస్తూ వారానికి ఒక సారి నీరు నిల్వ ఉన్న గాబులను శుభ్రంగా కడిగి మూత పెట్టే విధంగా చూడాలని చెప్పారు. సమావేశంలో డెమో కాశీనాథ్, డీపీహెచ్‌ఎన్‌ఓ విమల, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణ కార్యక్రమం

ఖమ్మంవైద్యవిభాగం: జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు విస్తృతమైన నీళ్ల విరేచనాల వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలు చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ బి.మాలతి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటిని సందర్శించి 0–5 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి నీళ్ల విరేచనాల సమస్య ఉంటే వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్, వయస్సుల వారీగా జింక్ మాత్రలు ఇచ్చి తగిన చికిత్స అందిస్తామని, సమస్యలు ఉన్న వారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలకు ఆశాలు, పారామెడికల్ సిబ్బంది పంపిస్తారని వివరించారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైనందున వ్యాధులు రాకుండా ప్రజ లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేడి పదార్థాలు తీసుకోవాల ని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశు భ్రత పాటించి డయేరియా లాంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది, ఆశా లు ఈ కార్యక్రమాన్ని అన్ని చోట్ల అమలుపరిచి పిల్లల్లో అతిసారం రాకుండా చూడాలని, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తం



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

నేలకొండపల్లి: మండలంలోని సదాశివాపురంలో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటనలో ఆమె బంధువులు దాదాపు 30 గంటల పాటు ఆందోళన చేశారు. తమ కుమార్తెను అల్లుడు అవినాష్ హత్య చేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాల్సిందేనని భీష్మించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మృతి చెందిన విజయ మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉంచగా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడి, దాడులు చేసుకున్న విషయం విదితమే. కాగా, సోమవారం సైతం ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎంతకూ సఖ్యత కుదరలేదు. మృతదేహానికి పోస్టుమార్టం చేసినప్పటికీ తీసుకెళ్లేందుకు బంధువులు నిరాకరించారు. ఈ క్రమంలో అవినాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడ్వాయి గ్రామం నుంచి విజయ బంధువులు భారీగా తరలివచ్చి ఆందోళన చేపట్టారు. చిన్నారుల విషయం తేల్చాలని పట్టుబట్టారు. అరుపులు, కేకల మధ్య ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల నుంచి పోలీసులు వచ్చి భద్రత కల్పించారు. ఎట్టకేలకు ఇరు వర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించారు. సదాశివాపురంలో పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

జూలూరుపాడు: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన గుంపెన రామస్వామి, పూనెం చుక్కమ్మ రైతుల పొలాల్లోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్‌వైరు అపహరించారు. సోమవారం ఉదయం మిరప నారు మడులకు నీళ్లు పెట్టేందుకు బాధితులు వెళ్లారు. విద్యుత్ సిబ్బంది విద్యుత్ హెడ్‌ఫీజులు వేయగా కరెంట్ రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి చూడగా పగలగొట్టి ఉండటంతో.. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

ఆపన్నహస్తం అందించండి..



మంచానికే పరిమితమైన లింగయ్య వద్ద భార్య రాజమ్మ

దీనగాథ

అశ్వాపురం: యజమాని కష్టం చేస్తేనే ఆ కుటుంబానికి భోజనం దొరుకుతుంది. కానీ, అనుకోని విధంగా పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన నిరుపేద దండి లింగయ్య పక్షవాతం, గుండెజబ్బుతో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారు. లింగయ్య మొదటి నుంచి వ్యవసాయ కూలి పనులకు వెళ్లేవాడు. లింగయ్య దంపతులకు ఇద్దరు అమ్మాయిలు కాగా దంపతులు కూలీ పనులు చేసి కొంత అప్పులు చేసి ఇద్దరు అమ్మాయిలకు పెళ్లిళ్లు చేశారు. ఈ క్రమంలో లింగయ్యకు పక్షవాతం, గుండెజబ్బు రావడంతో మంచానికే పరిమితమయ్యాడు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో రూ.లక్షలతో కూడిన వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేక భర్తను చూసి భార్య రాజమ్మ విలపిస్తోంది. దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. పూట గడవడమే కష్టంగా ఉన్న స్థితిలో వైద్యం ఎలా చేయించాలని రాజమ్మ కన్నీరుమున్నీరవుతోంది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఆదుకొని భర్త వైద్యానికి ఆర్థిక సాయం చేసి ప్రాణాలు కాపాడాలని రాజమ్మ వేడుకుంటోంది. సాయం చేయాలనుకునేవారు 86883 59072 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరుతోంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భైరవునిపల్లి గ్రామానికి చెందిన మహిళ భూచక్రం సోమవారం ఎలుకలమందు తాగింది. స్థానికులు గమనించి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆరెగూడెంలో వ్యక్తి...

నేలకొండపల్లి: గుళికలు మింగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన రాజు సోమవారం గుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కారణాలు తెలియాల్సి ఉంది.

పాముకాటుతో యువకుడు మృతి

ములకలపల్లి: పొట్టకూటి కోసం కూలికి వచ్చిన యువకుడు పాముకాటుకు గురై మృత్యువాతపడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా జీడికుప్ప మండలంలోని దారాపల్లి గ్రామానికి చెందిన కదల వెంకటరెడ్డి (23) మరో నలుగురితో కలిసి తాపీ పని నిమిత్తం జగన్నాథపురం వచ్చారు. అంతరూ కలిసి ఇంటిని నిర్మిస్తూ అక్కడే నిద్రించారు. ఆదివారం అర్ధరాత్రి వెంటకరెడ్డి చెవి వద్ద ఏదో కుట్టినట్లు అనిపించినా అలాగే నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత కళ్లు తిరగడం, వాంతులు కావడంతో హుటాహుటిన ములకలపల్లిలోని మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పాల్వంచ ఏరియాస్పత్రికి తరలించేసరికి వెంటకరెడ్డి మృతి చెందాడు. మృతుడి బంధువు ముత్యాల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.

జ్వరం లక్షణాలతో వ్యక్తి...

కొణిజర్ల: జ్వరం లక్షణాలతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సాలెబంజరలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లకావత్ శ్రీను కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కామెర్లు కూడా సోకడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నియామకపత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

పాల్వంచ: కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ధర్మరాజుల నాగేశ్వరరావు, సెక్రటరీగా నూనావత్ కేశులాల్‌నాయక్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించగా వారు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కోఆపరేటివ్ సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కనకదుర్గ వ్యవహరించారు. అధ్యక్ష పదవికి ధర్మరాజుల నాగేశ్వరరావు, బానోతు నాగమణి పోటీపడగా నాగేశ్వరరావుకు ఆరు ఓట్లు వచ్చాయి. ఇక సెక్రటరీ పదవికి కేశులాల్‌నాయక్, రమణ, వల్లమల్ల ప్రకాష్ పోటీపడగా, కేశులాల్‌కు ఐదు ఓట్లు వచ్చాయి. కాగా, రమణ తన ఓటును తనకు వేసుకోకపోవడం గమనార్హం.

గత పాలకవర్గం రాజీనామాతో..

గతంలో సొసైటీ అధ్యక్షులుగా దానం నర్సింహారావు, సెక్రటరీగా వల్లమల్ల ప్రకాష్ ఉన్నారు. కాగా కేటీపీఎస్ నుంచి యాదాద్రికి బదిలీ అయిన ఉద్యోగుల సొసైటీ సభ్యత్వం రద్దు చేయాలనే అంశంపై గత ఏప్రిల్ 25వ తేదీ సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వైటీపీఎస్ ఉద్యోగుల సభ్యత్వం తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఓ ఉద్యోగితో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులే ఫిర్యాదు చేయించారని మిగిలిన డైరెక్టర్లు ఆరోపించారు. ఎట్టకేలకు బదిలీ అయిన ఉద్యోగుల సొసైటీ సభ్యత్వం తొలగించేలా తీర్మానాలు చేశారు. ఈ క్రమంలో తమపై అవిశ్వాస తీర్మానం పెడుతారనే ఉద్దేశంతో అప్పటి అధ్యక్ష, కార్యదర్శులు తమ పదవులకు రాజీనామా చేయడంతో కొత్త పాలకవర్గ నియామకం అనివార్యమైంది.

సఫాయి కర్మచారిల సంక్షేమానికి చర్యలు



మాట్లాడుతున్న వావా, పక్కన కలెక్టర్, ఎస్పీ

కొత్తగూడెంటౌన్: సఫాయి కర్మచారిల సమస్యలను పరిష్కరించాలని, వారి సంక్షేమానికి చర్యలు చేపట్టాలని సఫారి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా అన్నారు. సోమవారం పాల్వంచ ఐడీఓసీ కార్యాలయంలో డాక్టర్ వావాను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. వావా మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య సేవలందించాలని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని శుభ్రపరిచే కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కర్మచారిల సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీఓ విద్యాచందన, డీఎస్పీ రెహమాన్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల సంక్షేమంపై సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కా ర్యాలయంలో సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమంపై కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకునే చర్యలపై సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ (పా) కార్మికులకు అందించే జీతభత్యాలు, సదుపాయాలు, శ్రేయస్సు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో బీఆర్ దీక్షితులు, సురేశ్‌బాబు, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సుజాత, రాజశేఖర్, వరప్రసాద్, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

- టీడీపీ నుంచి సి.రామచంద్రయ్య
- జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. రెండు స్థానాల్లో టీడీపీ, జనసేన ఒక్కొక్కటి పంచుకోవాలని నిర్ణయించారు. టీడీపీ తరపున సి. రామచంద్రయ్య, జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ కూటమి అభ్యర్థులుగా మంగళవారం నామినేషన్లు దాఖలు చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కూటమి సంఖ్యా బలం 164 కావడంతో వీరిద్దరి ఎన్నిక లాంఛనమే. ఎమ్మెల్సీలు అయిన సి. రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది. దీంతో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో సి. రామచంద్రయ్యకు టీడీపీ మళ్లీ అవకాశం కల్పించగా జనసేన హరిప్రసాద్‌ను ఎంపిక చేసింది.

మళ్లీ పాత బాబును చూస్తారు

చెప్పినట్లు నడుచుకోకపోతే 1995 నాటి సీఎం కనిపిస్తాడు జాగ్రత్త

- రాత్రికి రాత్రే ప్రజల ఆశలు తీరిపోవు
- అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి
- పెనమాక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు

వలంటీర్లతో పనిలేకుండా పింఛన్ల పంపిణీ

- వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో చూపించాం
- వలంటీర్లు రూ.100 తీసుకునేవారు
- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పవన్ కల్యాణ్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పింఛన్లపై పెత్తనం

ఏపీలో మరోసారి జన్మభూమి కమిటీలదే రాజ్యం

ఐదేళ్లు వివక్ష లేకుండా అందించిన పెన్షన్లకు రాజకీయ రంగులు

- పేరుకు మాత్రమే సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ
- కూటమి పార్టీ నేతల కనుసన్నల్లోనే అంతా..
- ఆధిపత్యం కోసం టీడీపీ - జనసేన ఆరాటం
- కార్లలో, చెట్ల కింద, రచ్చబండ, ప్రైవేట్ స్థలాలకు రప్పించడంతో లబ్ధిదారుల పడిగాపులు



అనకాపల్లి జిల్లా నక్కపల్లి సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఐదేళ్లు ఎలాంటి వివక్షకు తావులేకుండా టంచన్‌గా, పారదర్శకంగా అందించిన పింఛన్లపై జన్మభూమి కమిటీల రాజ్యం మళ్లీ మొదలైంది. టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లో సాగింది. ఇంటివద్ద అందించాల్సిన పెన్షన్లను కొన్నిచోట్ల చెట్ల కింద, రచ్చబండ వద్ద, ప్రైవేట్ స్థలాల్లో ఇస్తామని తిప్పడంతో పడిగాపులు కాసి అవస్థలు ఎదుర్కొన్నారు. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించినా పంపిణీ మొత్తం ప్రతి చోటా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల స్థానిక టీడీపీ నాయకులు చేతివాటం చూపినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల సహా పలు చోట్ల కమీషన్ల కింద రూ.500 మినహాయించుకుని ఫించన్ ఇస్తున్నట్లు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 2014–19 మధ్య కూడా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీ సభ్యులు లంచాల వసూళ్లకు తెగబడి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అదే వాతావరణం కనిపించినట్లు వాపోతున్నారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో 94 మంది లబ్ధిదారులకు మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో ఈ నెల ఫించన్లు నిలిచిపోయాయి. ఇన్నాళ్లూ ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటివద్దే నిశ్చింతగా కోవిడ్ కష్టకాలంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందిన ఫించన్లు ఈసారి కొన్నిచోట్ల ఉదయం 8 గంటలు దాటుతున్నా చేతికి అందకపోవడంతో పలుచోట్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల మంజూరు మొదలు పంపిణీ దాకా రాజకీయాలకు అతీతంగా, ఎవరి సిఫారసులు అవసరం లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లను అందచేసిన విషయం తెలిసిందే. దీనికి పూర్తి భిన్నంగా తాజాగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. గ్రామాల్లోనూ, వార్డులోనూ సచివాలయాల ఉద్యోగుల వెంట స్థానిక టీడీపీ, జనసేన నాయకులు మోహరించారు. ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తూ పోటాపోటీగా నేతలు ఫోటోలు దిగారు. విజయనగరం తదితర చోట్ల తమ ఆధిపత్యం నిరూపించుకునేందుకు జనసేన - టీడీపీ నేతలు పరస్పరం దాడులకు దిగిన ఉదంతాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూటమి నేతలు కొన్ని చోట్ల తమ ప్రత్యర్థి పార్టీకి ఓటు వేశారనే అక్కసుతో పలువురు పింఛన్లను తొలగించినట్లు వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో పెదంచలలో వైఎస్సార్ సీపీకి ఓటు వేసినందుకు తమ పింఛన్లు నిలిపివేశారంటూ కొందరు లబ్ధిదారులు సచివాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. కాగా నంద్యాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న 29వ వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుధారాణి (32) సోమవారం రాత్రి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో అనుమానాస్పద రీతిలో మరణించారు. వారం క్రితం స్థానిక సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో పాటు సచివాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన సుధారాణి సోమవారం టీడీపీ నేతలతో కలసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అనంతరం అనుమానాస్పద రీతిలో మరణించారు.

తొలిరోజు 95 శాతం..

మొత్తం 64.75 లక్షల మంది లబ్ధిదారులకుగానూ తొలి రోజు సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 61 లక్షల మంది (దాదాపు 95 శాతం)కి పైగా పింఛన్ల పంపిణీ పూర్తైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వలంటీర్లతో సంబంధం లేకుండా పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పంపిణీ కొనసాగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల వలంటీర్లు వారి వెంట వెళ్లి పంపిణీలో పాల్గొన్నారు. ఉదయం కొద్దిసేపు సాంకేతికపరమైన అవాంతరాలు తలెత్తడంతో వాటిని సరిదిద్ది ప్రక్రియ కొనసాగించారు.

వృద్ధులు ఉసూరు..

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కొన్ని వార్డుల్లో లబ్ధిదారులను నిర్దేశిత ప్రాంతానికి రావాలని ఆదేశించడంతో వృద్ధులు, దివ్యాంగులు నానా పాట్లు పడి అక్కడకు చేరుకున్నారు. కొందరి వేలిముద్రలు పడకపోవడంతో ఐరిస్‌తో ప్రయత్నించారు. చివరకు సరిపోలడం లేదని, ఫించన్ ఇవ్వలేమని చెప్పడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. పలువురు వృద్ధులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. మరికొన్ని వార్డుల్లో సచివాలయాలకు తాళం వేసి సిబ్బంది పింఛన్ల పంపిణీకి వెళ్లి పోవడంతో సమాచారం తెలియక పలువురు అక్కడకు చేరుకుని ఇబ్బందులు పడ్డారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజ్ఞప్తి
- లద్దాఖ్ ప్రమాదంలో జవాన్ల ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: లద్దాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో భారత జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మరణించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో ఈ జవాన్ల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. కృష్ణా జిల్లా పెడన మండలం చేవెంద్రకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లెకు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన హవల్దార్ సుభాన్ ఖాన్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ జవాన్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అమర జవాన్ల అంత్యక్రియల్లో పాల్గొనాలని, వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైఎస్ జగన్ ఆదేశించారు.

కలిసి మాట్లాడుకుందాం

- రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై చర్చిద్దాం
- తెలంగాణ సీఎంకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ
- ఈనెల 6న హైదరాబాద్‌లో ముఖాముఖికి ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై కలిసి చర్చించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి, సంక్షేమానికి పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరముందని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, రెండు రాష్ట్రాల లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో పనిచేయాల్సి వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యాయని చంద్రబాబు ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. పునర్వ్యవస్థీకరణ చట్టంవల్ల ఎదురవుతున్న సమస్యలపై ఇప్పటికే అనేక చర్చలు జరిగాయని, ఇవన్నీ సంక్షేమం, పురోగతిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి సామరస్యంగా ముందుకెళ్లడం అత్యవసరమని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లో కలుద్దామని రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిపాదించారు. ముఖాముఖి సమావేశం నిర్వహించుకుని క్లిష్టమైన సమస్యలపై సమగ్రంగా చర్చలు జరుపుదామన్నారు. ఏపీ, తెలంగాణకు పరస్పర ప్రయోజనం కలిగే పరిష్కారాలను కనుగొని అందుకనుగుణంగా సమన్వయంతో పనిచేయడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విభజన హామీలు అమలు చేయాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్వావలంబన, సమ్మిళిత అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారని గుర్తుచేశారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం ఏపీ ప్రజల్ని మోసం చేయడం, వారికి అన్యాయం చేయడమేనని అన్నారు. టీడీపీ మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నందున హోదా కోసం టీడీపీ ఒత్తిడి తేవాలన్నారు. విశాఖలో రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కూటమి పార్టీల నేతలు చేస్తున్న దాడుల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. దాడుల్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనందున కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

జిల్లా వార్తలు

ఖమ్మం పెద్దాస్పత్రిలో పెరిగిన ఓపీ సేవలు



ఓపీ చిట్టీ కోసం బారులుదీరిన బాధితులు

ఖమ్మంవైద్యవిభాగం : వర్షాకాల సీజన్ రావడంతో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఇప్పుడిప్పుడే సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతోంది. జిల్లాలో అక్కడక్కడా విషజ్వరాలు సోకుతుండగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి బాధితులు క్యూ కడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సోమవారం ఆస్పత్రికి తరలిరావడంతో ఓపీ వద్ద బారులుదీరి కనిపించారు. వైద్యుల గదులు, స్కానింగ్, ల్యాబ్‌ల వద్ద కూడా గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఇప్పుడిప్పుడే వైరల్ ఫీవర్స్‌తో రోగులు వైద్య సేవలు పొందేందుకు వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అంత ఇబ్బంది కలిగించే పరిస్థితులు మాత్రం ఇంకా లేవన్నారు.

ఉచితంగా ఓల్వో డ్రంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): పదో తరగతి పూర్తి చేసి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండి మూడేళ్ల అనుభవం కలిగినవారికి సింగరేణి ఆఫ్‌లోడింగ్ ఏజెన్సీల్లో ఓల్వో డ్రంప్ ట్రక్ ఆపరేటర్‌గా ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి ప్రభావిత ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఆయా ఏరియాల్లోని మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి, శిక్షణ ఇస్తామని పేర్కొంది. 18 నుంచి 35 ఏళ్ల లోపువారు అర్హులని, ఎస్సీ, ఎస్టీలకు వయోపరిమితిలో ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయని, శిక్షణ పూర్తయ్యాక కంపెనీ ఉద్యోగ అవకాశం కల్పించే అవకాశం ఉండదని వివరించింది.

లీకేజీలతో నీరు వృథా..

- కిన్నెరసాని నుంచి బయటకు పోతున్న నీరు
- ప్రాజెక్టు గేట్ల మధ్య నుంచి లీకులు..
- పదేళ్లుగా చేపట్టని మరమ్మతు పనులు
- నిధులు ఉన్నా.. నిరుపయోగమే



కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి వృథాగా పోతున్న నీరు



మొదటి క్రస్ట్‌గేట్ మధ్య లీకైన రబ్బర్ సీల్

పాల్వంచరూరల్ : కిన్నెరసాని రిజర్వాయర్ గేట్ల మధ్య లీకులు ఏర్పడి నీరంతా వృథాగా పోతోంది. గేట్లకు మూడు, నాలుగేళ్లకోసారి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా.. గత పదేళ్లుగా రిపేర్ చేసిన పాపాన పోలేదు. రిజర్వాయర్‌లో నీటిమట్టం 393 అడుగుల లెవెల్‌లో ఉంటే మరమ్మతులు చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. దీంతో కూ.30 లక్షల నిధులు అందుబాటులో ఉన్నా.. నీటి నిల్వలు కూడా అధికంగా ఉండడంతో మరమ్మతులు చేపట్టే అవకాశం దక్కడం లేదు. కిన్నెరసాని ప్రాజెక్టు గేట్ల సిల్స్ లీకై రెండు, మూడు సంవత్సరాలుగా నీరు బయటకు వస్తోంది. ఇది చిన్న సమస్యే అని కేటీపీఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం లేకపోలేదు. పరిశ్రమల అవసరాలకు, తాగు, సాగు నీరు అందించే కిన్నెరసాని ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు పిల్లర్లు, గేట్ల రబ్బర్ సిల్స్ లీకై లీకులు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సామర్థ్యం 407 అడుగులు..

కిన్నెరసాని రిజర్వాయర్ 407 అడుగల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. 13 క్రస్ట్ గేట్లతో 1962లో నిర్మాణ పనులు చేపట్టి 1972లో పూర్తిచేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణలో ఉండేది. 1998 ఏప్రిల్ 1న ఇరిగేషన్ శాఖ నుంచి జెన్‌కోకు అప్పగించారు. జెన్‌కో అధికారులు 2014లో రూ.60 లక్షల వ్యయంతో ప్రాజెక్టుకు చెందిన 13 క్రస్ట్ గేట్ల రోప్‌వేలు, సాకెట్లను మార్చారు. పదేళ్ల వరకు మార్చాల్సిన అవసరం లేకుండా చేశారు. కానీ ఒకటో క్రస్ట్ గేట్ నుంచి నాలుగు గేట్ల వరకు, 13వ క్రస్ట్‌గేట్ మధ్య పిల్లర్లు బీటలు వారడం, రబ్బర్ సీల్స్ లీక్ కావడంతో నీళ్లు బయటకు పోతున్నాయి. కేటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తికి, ఎన్ఎండీసీ, నవభారత్, కర్మాగారాల ఉత్పత్తులకు కిన్నెరసాని రిజర్వాయర్ నీరే శరణ్యం. ఇక పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరా కూడా ఇక్కడి నుంచే. పాల్వంచ మండలంలో మూడు వేలు, బూర్గంపాడు మండలంలో 7 వేల ఎకరాలకు సాగునీరు ఈ ప్రాజెక్టు నుంచే విడుదలవుతోంది. రిజర్వాయర్ నీటిమట్టం ఈ ఏడాది గరిష్ట స్థాయికి చేరడంతో పిల్లర్ల మధ్య బీటలు వారిన ప్రదేశం నుంచి నీరు బయటకు వస్తోంది.

రూ.2 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు..

కిన్నెరసాని ప్రాజెక్టు పిల్లర్ల మధ్య నుంచి లీకైన ప్రదేశంలో గతంలో మరమ్మతులు చేసిన సిల్స్ నుంచి లీకులు ఏర్పడి నీరు బయటకు వెళ్తోంది. అయితే అవి ప్రమాదకరం కాదని కేటీపీఎస్ అధికారులు అంటున్నారు. రిజర్వాయర్‌లో 400 అడుగులకు పైగా నీటిమట్టం పెరిగినప్పుడే బీటలు వారిన దగ్గర నుంచి నీళ్లు బయటకు వెళ్తున్నాయని చెబుతున్నారు. కాగా, పిల్లర్ల మరమ్మతులు, ఇతర పనుల కోసం ఏడేళ్ల క్రితం రూ.2 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు.

మరమ్మతులకు నిధులున్నాయి..



కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లకు పదేళ్ల క్రితం ఒకసారి మరమ్మతులు నిర్వహించాం. సిల్స్ లీక్ కావడంతో నీరు స్వల్పంగా బయటకు వస్తోంది. మరమ్మతు పనుల కోసం సీఈ, జెన్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ డ్యామ్‌లో 393 అడుగుల మేర నీరుంటేనే మరమ్మతులు చేసే అవకాశం ఉంది. ఇప్పుడు మరమ్మతులు చేపట్టాలంటే ఒక టీఎంసీ నీటిని బయటకు పంపించాలి. కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదు. వచ్చే ఏడాది టెండర్లు పిలిచి మరమ్మతులు చేపడతాం.

– ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5వ దశ సీఈ

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్
- చిన్నారి వైద్యానికి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలం: వర్షాకాలం సీజన్ అయినందున ఏజెన్సీలోని వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత యూనిట్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా, గిరిజన దర్బార్‌లో దమ్మపేట మండలం బంజర గ్రామానికి చెందిన వీరస్వామి బోరు, మోటారు, కరెంటు సరఫరా చేయాలని, కరకగూడెం మండలం టోకియా తండా గ్రామానికి చెందిన హర్షిత గురుకులం పాఠశాలలో ఐదో తరగతిలో సీటు ఇప్పించాలని, టేకులపల్లి మండలం బిల్లు తండాకు చెందిన అనుపమ ఆరో తరగతిలో ప్రవేశానికి, టేకులపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన పద్మ పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, గురుకుల ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, ఎస్డీసీ రవీంద్రనాథ్, ఎస్ఓ సురేష్ బాబు, ఏపీఓ మునీర్ పాషా, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్, ఉద్యానవనాధికారి అశోక్, ఏడీ భాస్కర్, మేనేజర్ ఆదినారాయణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

వైద్యానికి సాయం..

పుట్టుకతోనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చంటి పాప వైద్యానికి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి పీఓ రాహుల్ పాప తల్లికి చెక్కు అందించారు. సుజాతనగర్ మండలానికి చెందిన మాలోత్ సౌమ్య.. తన బిడ్డ పుట్టుకతోనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోందని, సాయం అందించాలని కలెక్టర్‌ను వేడుకోగా, ఆయన ఆదేశం మేరకు పీఓ రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.

బోడకాకర @ రూ. 550



బోడ కాకర

ఖమ్మంవ్యవసాయం: ఎక్కువ మంది అమితంగా ఇష్టపడే బోడకాకర కాయల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మంలో సోమవారం రూ.550కి కిలో చొప్పున బోడ కాకర కాయలు విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులు కిలో రూ. 450 చొప్పున కొనుగోలు చేసి రూ. 100 అధికంగా రిటైల్ మార్కెట్లు, రైతు బజార్‌లు, వీధి వ్యాపారుల ప్రాంగణాల్లో విక్రయస్తన్నారు. గతేడాది రూ. 200 నుంచి రూ. 250 వరకు ఉండగా, ప్రస్తుతం అది రెట్టింపైంది. ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్‌కు చెందిన ఓ వ్యాపారి టమాటాతో పాటు బోడ కాకర తీసుకొచ్చి రిటైల్ వ్యాపారులకు విక్రయించారు. ఈ పంట మరో నెల రోజులైతే ఇక్కడ కూడా లభిస్తుంది. అప్పటి వరకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోక తప్పదు. జిల్లాలో పండించిన పంట అందుబాటులోకి వస్తే ధర తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

చికెన్ ధరకు రెట్టింపు..

ప్రస్తుతం చికెన్ ధరన రూ. 250 నుంచి రూ. 270 వరకు విక్రయిస్తున్నారు. ఆ ధరకు రెట్టింపు కంటే అధికంగా బోడ కాకర ధర రూ. 550 ఉంది. సహజంగా బోడకాకర ఎప్పుడైనా చికెన్ ధరతో సమానంగా ఉండేది. కానీ ఇప్పుడది రెట్టింపు అయింది.

నూతన చట్టాల అమలును నిలిపేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్ : ప్రజావ్యతిరేక నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని కోరుతూ న్యాయవాదులు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. మూడు కొత్త క్రిమినల్ చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయని, ఈ చట్టాలు బాధితులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా ఆలా కనిపించడం లేదన్నారు. ప్రథమ సమాచార నివేదికే ఇందుకు ఉదాహరణ అన్నారు. సీనియర్ న్యాయవాదులు వడ్డెల్లి కృష్ణమూర్తి, లతీఫ్, శేషగిరి, మలీదు నాగేశ్వరరావు, బి.తిరుమలరావు మాట్లడుతూ.. ఈ చట్టాలు అమలైన సోమవారాన్ని చీకటి రోజుగా అభవర్ణించారు. కొత్త క్రిమినల్ చట్టాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదులు ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకుడు పోట్ల మాధవరావు, శేషగిరి రావు, ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వరరావు, ఎన్. నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్, మేకల సుగుణారావు, రామ్మూర్తి, జమ్ముల శరత్‌కుమార్ రెడ్డి, పి.దానయ్య, నాగేష్ బాబు, లక్ష్మీనారాయణ, కల్యాణి, ప్రకాష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.